

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న షాద్‌నగర్ ఆర్డీవో సరిత

వాగ్వివాదానికి దిగిన నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

10వ వార్డులో ఘర్షణ వాతావరణాన్ని అదుపు చేస్తున్న ఎస్ఐ

పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి సుధీర్ బాబు, డిసిపి శిరీష

9వ వార్డులో ఆందోళనకారులను అదుపు చేస్తున్న పోలీసులు

# వివాదాల నడుమ.. పోల్ సీన్

## షాద్‌నగర్‌లో 76.24 శాతం పోలింగ్

## కొన్ని వార్డులలో దొంగ ఓట్ల కలకలం..

## పోలీసుల అప్రమత్తతతో అంతా ప్రశాంతం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** ఒకవైపు పోలీస్ బందోబస్తు.. మరోవైపు అభ్యర్థుల మధ్య వివాదాలు.. అడుగడుగునా ఉత్కంఠ.. అయినా అంతా ప్రశాంతం.. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికలు వివాదాలు, ఆరోపణలు, దొంగ ఓట్ల కలకలం లాంటివి కొనసాగినప్పటికీ మొత్తానికి షాద్ నగరలో 76.24 శాతం పోలింగ్ శాతం నమోదై ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీకి బిఆర్ఎస్, బిజెపి పార్టీల మధ్య అభ్యర్థులతో స్వల్ప వివాదాలు చోటు చేసుకున్నాయి. ఉద్రిక్త వాతావరణానికి దారి తీయకుండా పోలీసులు వెంటనే అప్రమత్తం కావడంతో ఎన్నికల ప్రక్రియ సమయానుకులంగా పూర్తయింది. షాద్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 53,403 ఓట్లకు గాను 40 వేల మందికి పైగా ప్రస్తుతం బ్యాలెట్ బాక్స్‌లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు 13వ తేదీన వెలుగులోకి రానుంది.

**ఇలా మొదలైంది..**

పట్టణంలోని 28 వార్డులలోను ఎలాంటి జాప్యం లేకుండా ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. అయితే ఉదయం మందగొండిగా ఉదయం 9 గంటల వరకు కేవలం 11.84 శాతం ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల వరకు 65.28 ఓట్ల శాతం 34,843 పోలైన ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన పోలింగ్ లో మొత్తం 76.24 శాతం పోలింగ్ నమోదు అయినట్టు ఎన్నికల అధికారిని కమిషనర్ సునీతా రెడ్డి మీడియాకు తెలిపారు. పలుచోట్ల జనం క్యూలో నిలబడి ఓట్లు వేయడం కనిపించింది. మొత్తం 28 వార్డులకు 92 మంది అభ్యర్థులు ఉండగా ఎన్నికల నిర్వహణలో 380 మంది సిబ్బంది, 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. తర్వాత ఓటర్ల రావడానికి నిలిపివేసి 5 గంటలకు అక్కడికి చేరిన ఓటర్లకు మాత్రం ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో కొంతమంది ఆలస్యంగా రావడం వల్ల తమ ఓటు హక్కు వినియోగించు కోలేకపోయారు.

**వివాదాల పరంపర..**

కొన్ని వార్డుల్లో పార్టీ నాయకులు, అభ్యర్థుల వివాదాలు పోలీసులకు సవాలుగా మారాయి. పట్టణంలోని 9, 10, 15 వార్డుల్లో చెదురు మదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. అలాగే 9, 16 వార్డుల్లో దొంగ ఓట్ల కలకలం చెలరేగింది. ఇద్దరు మహిళల ఓట్లు ఇతరులు వేసి వెళ్లిపోవడంతో వాస్తవ ఓటర్లు వచ్చి ఎన్నికల కేంద్రం వద్ద ఆవేదనతో వెనుతిరిగారు. 9, 10, 15 వార్డుల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల మధ్య వివాదం జరిగింది. అయితే పోలీసులు సమయానుకూలంగా అప్రమత్తమై ఉద్రిక్త వాతావరణం ఏర్పడకుండా నిరోధించారు. పట్టణంలోని పదవ వార్డులో ఓటర్లను ప్రలోభ పెడుతున్నారనే ఆరోపణ మీద కాంగ్రెస్ నాయకుడు జమ్రుద్ ఖాన్, బీఆర్ఎస్ నాయకుడు పిల్లి శేఖర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. పోలీసులు అప్రమత్తం కావడంతో గుంపును చెదరగొట్టి వివాదం పెరగకుండా అడ్డుకోగలిగారు. ఇక 15వ వార్డులోనూ కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకుల మధ్య వివాదం జరిగింది. కాంగ్రెస్ దౌర్జన్యం చేస్తుందని బిఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ దౌర్జన్యానికి పాల్పడుతుందని కాంగ్రెస్ నాయకులు పరస్పరం ఆరోపించుకున్నారు. ఇక్కడ కూడా పోలీసుల చొరవతో గొడవ సద్దుమణిగింది. ఇక ఎన్నికల చివరి దశలో 9వ వార్డులో బిజెపి నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం వివాదానికి తెరతీసింది. ఏసీపి లక్ష్మీనారాయణ రంగంలోకి దిగి గొడవ పెరగకుండా అడ్డుకున్నారు. అదేవిధంగా 27 వ వార్డులో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహిళపై బిజెపి అభ్యర్థి మంగ విజయ్ దౌర్జన్యానికి పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి.

**సిపి సుధీర్ బాబు పర్యటన..**

ఫరూక్‌నగర్ మండల కేంద్రంలో రెండు వార్డులను సైబరాబాద్ సిపి సుధీర్ బాబు డిసిపి శిరీషతో కలిసి సందర్శించారు. వార్డులలో ఎన్నికల సర్వే ఎలా జరుగుతుంది అన్నది ఆయన తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, ఎన్నికల విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పు అని హెచ్చరించారు. అదేవిధంగా ఆర్డీవో సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమారులు ప్రతి వార్డు తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది కూడా నిర్విరామంగా ఎన్నికల విధుల్లో పాల్గొని ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించారు.

**దొంగ ఓట్ల కలకలం..**

కొన్ని వార్డుల్లో దొంగ ఓట్ల కలకలం ఆందోళన లేపింది. 9వ వార్డులో ఇదే అంశంపై వివాదం చోటు చేసుకోగా 8వ వార్డులో పోలీసు కూతురు చందనకు తొలిసారి ఓటు వేసే అవకాశం లేకుండా ఎవరో మిగతా 2లో

### మహిళా ఓటర్‌పై బిజెపి అభ్యర్థి దౌర్జన్యం ?

## షాద్‌నగర్ 27వ వార్డులో కలకలం

### ఊరు విడిచి వెళ్లిపోతామని యూపీ మహిళ భయాందోళన

**షాద్‌నగర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఓ వలస మహిళ ఓటర్‌పై బిజెపి అభ్యర్థితో సహా మరొకరు దాడికి పాల్పడిన సంఘటన సంచలనం రేగింది. పట్టణంలోని 27వ వార్డు పరిధిలోగల తిరుమల కాలనీలో ఓట్ల కొనుగోలు జరుగుతోందంటూ ఆ పార్టీ అభ్యర్థి మంగ విజయ్, మంగ రఘు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మీరా అనే మహిళ ఇంట్లోకి చొరబడ్డారు. ఆమెను నిలదీసి బెదిరించటంతో బాధితురాలు తీవ్ర భయాందోళనలకు గురైంది. మిగతా 2లో



కన్నీటి పర్యంతమవుతున్న బాధిత మహిళ

## మూడు నెలల కవలలతో వచ్చి.. ఓటేసి..

### హర్షం వ్యక్తం చేసిన మహిళా ఉద్యోగులు

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య బాధ్యతను చాటి చెప్పే హృదయాన్ని తాకే ఘటన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలో చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ నుంచి వచ్చిన సంధ్య అనే మహిళా తన మూడు నెలల కవల పిల్లలను వెంట తీసుకుని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంధ్యతో పాటు ఆమె తోబుట్టువైన శివాని కూడా వచ్చారు.

## 10వ వార్డులో బాహాబాహి

### ఇరు వర్గాలను చెదరగొట్టిన పోలీసులు

### ఏసిపి లక్ష్మీనారాయణ జోక్యంతో సద్దుమణిగిన వివాదం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలోని పదవ వార్డులో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. పదో వార్డ వద్ద కాంగ్రెస్ నాయకులు జమ్రుద్ ఖాన్ వర్గం, పిల్లి శేఖర్ వర్గాలకు చెందిన కార్యకర్తలు పోలింగ్ కేంద్రం నిషేధాజ్ఞల వెలుపల ఓటర్ల విషయంలో జోక్యం చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య మాట పెరిగి వివాదానికి దారి తీసింది. అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న కేశంపేట సిఐ నరహరి, ఎస్సై విజయ్ తదితర పోలీస్ సిబ్బంది వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు జమృత్ ఖాన్, 11వ వార్డు టిఆర్ఎస్ నాయకుడు పిల్లి శేఖర్ సంఘటన స్థలం వద్ద గట్టిగా అరవడంతో అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఏసీపి లక్ష్మీనారాయణ, పట్టణ సిఐ విజయకుమార్ ఇరువర్గాలను అక్కడి నుండి చెదరగొట్టారు. ఇలాంటి వివాదాలకు ఉద్రిక్తతకు తావివ్వకుండా శాంతి వాతావరణం నెలకొల్పేందుకు ఇరువర్గాలను దూరం పంపించేశారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

## రంగారెడ్డి జిల్లాలో 78.52 శాతం

**రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి11, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో సాయంత్రం 5 గంటల వరకు 78.52 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలో ఆరు మున్సిపాలిటీల్లో 126 వార్డులు, 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 1,76,023 మంది ఓటర్లు ఉండగా, అందులో 1,38,222 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అమనగల్ మున్సిపాలిటీలో అత్యధికంగా 84.74 శాతం పోలింగ్ నమోదు కాగా, చేవెళ్ల మున్సిపాలిటీలో 80.92 శాతం, మొయినాబాద్ మున్సిపాలిటీలో మిగతా 2లో



తన ఓటు చోరీకి గురైందని వివరిస్తున్న యువతి

## మొదటి'సారి' ఓటు పాయె..

### ఎన్నికల అధికారుల నిర్లక్ష్యంపై యువతి ఆవేదన

**షాద్‌నగర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మొదటిసారిగా వచ్చిన ఓటు హక్కును వినియోగించుకుందామని ఆశగా పోలింగ్ కేంద్రానికి వెళ్లిన యువతికి ఊహించని షాక్ తగిలింది. అప్పటికే ఆమె ఓటును ఎవరో వేసి వెళ్ళిపోవడం చూసి దిగ్భ్రాంతికి గురైంది. పట్టణంలోని ఎనిమిదో వార్డులో చందన అనే యువతకి ఎదురైన పరిస్థితి ఇది. పైగా తన తండ్రి సత్యనారాయణ పోలీసు కావడం గమనార్హం. ఆమెకు మొట్టమొదటిసారి ఈ విడత ఓటు హక్కు మిగతా 2లో

## ఛాలెంజింగ్ ఓటు వేయిస్తామని గంటల తరబడి నిరీక్షణ

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓ మహిళకు చేదు అనుభవం ఎదురైంది. తన ఓటు తానే వేయడానికి పోలింగ్ బూత్‌కు వెళ్లగా.. అప్పటికే ఎవరో వేశారని అధికారులు చెప్పడంతో ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ 15వ వార్డులో చోటుచేసుకుంది. శేరిగూడకు చెందిన శ్యామ పారిజాత ఓటు వేయడానికి గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి చేరుకుంది. ప్రజాస్వామ్య హక్కు వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో క్యూలో నిలబడి తన వంతు కోసం ఎదురుచూసింది. తీరా తన వంతు రాగానే పేరు, వివరాలు తెలిపింది. అయితే, పోలింగ్ సిబ్బంది ఆమె ఓటు ఇప్పటికే పోలైనట్లు తెలిపారు. దీనితో ఒక్కసారిగా షాక్‌కు గురైన పారిజాత, నేను ఇప్పుడే వచ్చాను.. నా ఓటు నేనే వేయాలి" అని వాదించింది. అధికారులు మరోసారి పరిశీలించినప్పటికీ ఓటు వేసినట్లే నమోదైందని చెప్పడంతో ఆమెకు నిరాశే మిగిలింది. ఈ క్రమంలో ఆమెకు ఛాలెంజింగ్ ఓటు వేయిస్తామని అధికారులు చెప్పినట్లు ఆమెను సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రం మిగతా 2లో

# ఉదయం నుంచే ఓటెత్తి..

### పోలింగ్ కేద్రాలకు భారీగా తరలి వచ్చిన మహిళలు



పొన్నాల్‌లో ఓటు వేసి వస్తున్న వృద్ధురాలు, వృద్ధ ఓటర్లను ఆటోలో తీసుకువస్తున్న దృశ్యం





ఉద్దెమర్రిలో క్యూలో నిలబడి ఉన్న ఓటర్లు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల్లో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని 24వార్డులలో 48పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగ జరిగి 89.07శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా భారీ ఎత్తున పోలీసు బందోబస్తును మల్కాజ్‌గిరి జోన్ డిసిపి శ్రీధర్ పర్యవేక్షణలో జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు జరిగింది. ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఉండటంతో పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ప్రశాంతంగ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే మున్సిపాల్టీలోని 24వార్డులలో మొత్తం ఓటర్లు 22,831మంది ఉండగ వీరిలో 20,337మంది ఓటర్లు తమ ఓటు హక్కును సాయంత్రం 5గంటలోపు చివరి వరకు వినియోగించుకున్నట్లు సహాయ ఎన్నికల అధికారి, మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామాల్లోని ఆయా వార్డుల్లో అభ్యర్థులు తమను గెలిపించాలని కోరుతూ చివరి వరకు ఓటర్లను అభ్యర్థించటం కనిపించింది. ప్రధానంగ కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల అభ్యర్థులు తమను గెలిపించాలని కోరుతూ ఓటర్లను కలిసి కోరటం జరిగింది. ఇక బుధవారం సాయంత్రం 5గంటలతో పోలింగ్ పూర్తి కావటంతో బ్యాలెట్ బాక్సులను మున్సిపాల్టీలోని ఆయా గ్రామాల్లోని వార్డుల పోలింగ్ కేంద్రాల నుంచి జగ్గంగూడలో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌కు వాహనాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి బ్యాలెట్ బాక్సులను తరలించి స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. ఇక అభ్యర్థుల భవితవ్యం మిగతా 2లో



ఎన్నికల సిబ్బంది నిర్వాకాన్ని చెబుతున్న మెడిసని లక్ష్మి

## వృద్ధురాలిని వెనక్కి పంపేసిన ఎన్నికల సిబ్బంది

### జగ్గంగూడలో సంచలనం

### ఓటు వేయనీయలేదని వృద్ధురాలు ఆందోళన

# మా జాబితాలో నువ్వు చనిపోయావ్

**శామీర్‌పేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని జగ్గంగూడలో 13వ వార్డులో పోలింగ్ కేంద్రం నెంబరు 26లో మేడిసని లక్ష్మి (70) అనే వృద్దురాలు ఓటు వేయటానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లగా ఓటరు జాబితాలో ఆమె మృతిచెందినట్లుగా పేర్కొనటంతో ఆమె ఈ విషయం తెలుసుకుని బిత్తర పోయారు. బుధవారం జగ్గంగూడలోని 13వ వార్డులోని 26 నెంబరు పోలింగ్ కేంద్రానికి మేడసాని లక్ష్మి తన కుమారునితో కలిసి ఓటు వేయటానికి విచ్చేసింది. అయితే ఆ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లగా మేడసాని లక్ష్మి మృతిచెందినట్లు ఓటరు జాబితాలో ఉందని ఓటు వేయటానికి లేదని పోలింగ్ అధికారులు అనటంతో ఆమె వెనుతిరిగి ఆశ్చర్యం వ్యక్తం చేసి ఇదేమిటని ఆందోళనకు గురైంది.

ఓటు వేయటానికి మేడసాని లక్ష్మి కుమారుడు వెంట తీసుకుని రాగ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి తిరిగి బయటకు వచ్చి తన ఓటు లేదని మృతిచెందినట్లు ఓటరు జాబితాలో టిక్ చేశారని అంటున్నారని అనటంతో ఆమె బయటకు వచ్చింది. దీంతో ఆమె కుమారుడు ఈ విషయాన్ని పోలింగ్ కేంద్రం వద్ద తెలియజేశారు.

బతికి ఉండగానే మృతిచెందినట్లు ఓటరు జాబితాలో ఎలా గుర్తిస్తారని ఆయన కుమారుడు విమర్శించారు. ఈ విషయం జగ్గంగూడలో చర్చనీయాంశంగ మారింది.

### వెండి నాణాలను పంపిణీ చేశారు

**బిజెపిపై బిఆర్ఎస్ నాయకుల ఆరోపణ**

అలియాబాద్ మున్సిపాల్టీలోని లాల్‌గడిమలక్‌పేట్‌లోని 5వ వార్డులో బిజెపి అభ్యర్థి కన్‌రెడ్డి మాలతి ఓటర్లను ప్రలోభపెట్టటానికి వెండి నాణాలను పంపిణీ చేశారని ఆ గ్రామ బిఆర్ఎస్ నాయకులు ధశరథ్ ఆరోపించారు. బుధవారం పోలింగ్ సమయంలో బయట ఈ విషయంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి వారు ఓటర్లను మోసం, ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం జరిగిందని, ప్రలోభాలకు గురిచేశారని ఆయన ఆరోపించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. అయితే పంపిణీ చేసినవి కూడ వెండి నాణాలా లేక నకిలీవినా అనేది కూడ అనుమానంగ ఉందని బిఆర్ఎస్ నాయకులు ధశరథ ఆరోపించారు. ఈ విషయం లాల్‌గడిమలక్‌పేట్‌లో ఓటర్లను ప్రలోభపెట్టటానికి చేసిన కుట్రనే అని ఆయన ఆరోపించారు.

# జాతకాలు తేలేది రేపే

## ఇబ్రహీంపట్నంలో 77.77 శాతం ఓటింగ్ నమోదు

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11, ప్రభతవార్త :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటర్లు భారీగా పాల్గొని ప్రజాస్వామ్యానికి తమ మద్దతును చాటిచెప్పారు. మొత్తం 25,993 ఓట్లలో 20,216 ఓట్లు పోలవడంతో 77.77 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్‌లో మహిళల ఉత్సాహం ప్రత్యేకంగా కనిపించింది. 12,741 మంది పురుషులు, 13,252 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ పూర్తికోవడంతో పాటు అక్కడ పలు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు అందరి చూపు 13న జరిగే కౌంటింగ్‌పైనే నిలిచింది. రేపటి భవితవ్యం ఏ పార్టీకి అనుకూలంగా మారుతుందన్న దానిపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. గెలుపు-ఓటముల ఉత్కంఠలో అభ్యర్థుల గుండెల్లో దడ మొదలైంది.



బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంకు తరలిస్తున్న సిబ్బంది



ఓటు హక్కు వినియోగించుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్
కుటుంబ సమేతంగా ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్

# వికారాబాద్‌లో పోలింగ్ ప్రశాంతం

**వికారాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని వికారాబాద్ మున్సిపాలిటీలో 2 వార్డులు ఏకగ్రీవం కావడంతో మిగతా 98 వార్డులకు పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా, సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహించి, పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. చిన్న పాటి చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. వికారాబాద్ పట్టణంలోని 6 వార్డులోని 15వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కుటుంబ సమేతంగా బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 98 వార్డులకు పోలింగ్ నిర్వహించగా, 1,70,379 మంది ఓటర్లకు గాను 1,22,360 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు మున్సిపాలిటీల్లో 71.82 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. వికారాబాద్ మున్సిపాలిటీలో 32 వార్డుల్లో పోలింగ్ జరుగగా, 54,185 మంది ఓటర్లకు గాను 40,287 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 74.34 శాతం పోలింగ్ నమోదైంది. మిగతా 2లో

## బైక్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** బైక్ ఢీకొని తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒగుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఎం సీనగర్ వంతెన సవమీపంలో మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో జాతీయరహదారిపై చెత్త సేకరిస్తున్న ఒగుర్తుతెలియని వ్యక్తి (50)ని యూనికాన్ బైక్ (ఎపీ28సికె-8929) ఢీకొట్టింది. దీంతో తలకు శరీర భాగాలకు తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్సులో గాంధీ ఆసుపత్రికి తరలించి ఎంఎల్‌సీ నెం: 79408 నమోదు చేశారు. కాగా అతని పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున 3:30 గంటలకు మృతిచెందాడు. మృతుడు కాషాయం రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ దరించి ఉన్నాడని, బైక్ నిర్లక్ష్యంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన నితిన్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ తెలిపారు.

## వివాదాల నడుమ పోల్ సీన్

(మొదటి పేజీ తరువాయి)

దొంగ ఓటు వేసి వెళ్లడం ఆందోళనకు దారితీసింది. అదేవిధంగా పదో వార్డులో కూడా కొంతమంది దొంగ ఓట్లు వేసినట్లు ఆయా పార్టీల నాయకులు ఆరోపించారు. మొత్తానికి ఎన్ని వివాదాలు ఉన్నప్పటికీ ఎన్నికలు మాత్రం ప్రశాంతంగా ముగిసి అటు పోలీసులను, ఇటు అధికారులను ఊపిరి పీల్చుకునేలా చేశాయి.

**ఏం జరుగుతుందక్కడ.. నాకు తెలియాలి..**

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపాలిటీలో తన ఓటు లేకపోవడంతో ఎక్కడ కూడా ఆయన ఎన్నికలు జరిగే చోటికి రాలేదు. అయితే తన పార్టీ కార్యాలయంలో కూర్చుని ఎప్పటికప్పుడు ఏ వార్డులో ఓటింగ్ సరళి ఎలా ఉంది. తమ పార్టీకి ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా.. ఏదైనా వివాదాలు జరుగుతున్నాయా.. ఓట్ల వ్యవహారం ప్రశాంతంగా ఉందా లేదా.. అన్న వివరాలను నాయకులు, కార్యకర్తల ద్వారా తెలుసుకున్నారు. అదేవిధంగా ఎక్కడైనా దొంగ ఓట్ల వివాదాలు కానీ, నాయకుల మధ్య వివాదాలు కానీ జరిగినప్పుడు వెంటనే పోలీసులను అప్రమత్తం చేసి అలాంటివి జరగకుండా తన వంతు కృషి చేశారు. తమ పార్టీకి ఎన్ని స్థానాలు రావచ్చు.. అన్న దానిపై ఎప్పటికప్పుడు ఆయన ఆరా తీస్తూ కనిపించారు.

## మహిళా ఓటరుపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

తమను ఇక్కడ బతకనివ్వరని, తెలుగు వాళ్ళు మమ్మల్ని ఏం చేసినా పట్టించుకోరని ఎక్కడ ఉంటే ప్రాణాలు అరచేతిలో పెట్టి బతకాలని, ఇదేం దౌర్జ్యమని ఆమె ప్రశ్నిస్తూ కన్నీటి పర్యంతమైంది. తాము ఈ ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోతామని మీరా ఆమె భర్త సాహులు ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా బాధితులను కలిసి జరిగిన విషయాన్ని ప్రశ్నించగా వారు పలు విషయాలు వారి దౌర్జన్యాల గురించి వివరించారు. అయితే పోలీసులకు ఫిర్యాదు చేశారా అంటే వారు భయపడ్డారు. ఫిర్యాదు చేస్తే తమల్ని బతకనివ్వరని వారు చెప్పారు. మహిళ భర్త సాహూ మాట్లాడుతూ జరిగిన జరిగిపోయింది ఇప్పుడు మేము ఏం చేస్తాం, మమ్మల్ని కంపెనీలో ఉద్యోగంలో నుండి తొలగిస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. ఎన్నికలు అయ్యాక అంతు చూస్తామని బెదిరించినట్టు బాధితులు వాపోయారు. అయితే ఈ విషయమై బిజెపి అభ్యర్థి మంగ విజయ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సురేష్ రెడ్డి తదితరులు వార్డులో మీరా ఇంట్లో ఓట్లను కొనుగోలు చేస్తున్నారని సమాచారం పై వెళ్ళామని అక్కడ మహిళలు నిలదీయడం జరిగిందని దాడి చేయలేదని చెప్పారు.

## ఉదయం నుంచే ఓటెత్తి

(మొదటి పేజీ తరువాయి)

బ్యాలెట్ బాక్సులో ఉండటం, అభ్యర్థుల్లో మాత్రం పోలింగ్ సరళిని చూసినప్పటికీ టెన్షన్‌లో ఉండటం ఈ నెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడితో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

**..అలియాబాద్ మున్సిపాల్టీలో ప్రశాంతం..**

అలియాబాద్ మున్సిపాల్టీలోని 20వార్డులలో 40పోలింగ్ కేంద్రాలలో 79.62శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపాల్టీలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయటం జరిగింది. పోలింగ్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. వృద్దులు, మహిళలు, ఓటర్లు అందరు పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచే విచ్చేసి ఓటు హక్కును వినియోగించుకోవటం ప్రారంబమైంది.

ఆ తరువాత మందకోడిగా పోలింగ్ జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ పోలింగ్ ప్రశాంతంగ జరిగింది. అయితే అలియాబాద్ మున్సిపాల్టీలోని 20వార్డులలో మొత్తం ఓటర్లు 20,454మంది ఓటర్లు ఉండగా వీరిలో పోలింగ్ చివరి వరకు 16,286 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల సహాయ అధికారి, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పోలింగ్ పూర్తి తరువాత ఆయా వార్డులకు సంబంధించి పోలింగ్ కేంద్రాల నుంచి అలియాబాద్ మున్సిపాల్టీలోని మజీద్‌పూర్‌లోని టి చైతన్య హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సులను పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి వాహనాల్లో తరలించారు. ఆ తరువాత వాటిని స్ట్రాంగ్ రూమ్‌ల్లో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. ఇక కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు, ఇతర అభ్యర్థుల భవితవ్యం అంత కూడ బ్యాలెట్ బాక్సుల్లోకి చేరింది. ఓటర్లను మాత్రం అభ్యర్థులు పోలింగ్ చివరి వరకు కూడ తమను గెలిపించాలని కోరటం పోలింగ్ కేంద్రాల సమీపాల్లో కనిపించింది. సైబరాబాద్ పోలీసు, కుత్బుల్లాపూర్ జోన్ పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జీనోమ్‌వ్యాలీ పోలీస్ సిఐ గురువయ్య పోలీసులు భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు జరిగింది. ఈ నెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనున్నందున కౌంటింగ్ సెంటర్ వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇక మున్సిపల్ వార్డులకు పోటీ చేసిన అభ్యర్థుల్లో మాత్రం టెన్షన్ కొనసాగుతుందని, కౌంటింగ్ పూర్తి తరువాత వారి భవితవ్యం తేలనుందని చెప్పవచ్చు.

## ఛాలెంజింగ్ ఓటు వేయిస్తామని గంటల తరబడి నిరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

వద్దే నిలబెట్టినట్లు ఆమె ఆరోపించింది. గంటల తరబడి నిలబెట్టారు..చివరికి ఓటు హక్కు కూడా కల్పించలేదు అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తన ఓటు హక్కు హరించబడిందని, దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేసింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పోలింగ్ ప్రక్రియలో లోపాలు ఎలా జరిగాయన్న దానిపై ఎన్నికల అధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, అలాంటి హక్కు కోల్పోయే పరిస్థితులు పునరావృతం కాకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఫుట్‌బాల్ విజేతలకు బహుమతులు అందజేత

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** క్రీడల్లో రాణించడం ద్వారా సమాజంలో గుర్తింపు లభిస్తుందని విబిఐటి ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎస్ శ్రీనివాస్ అన్నారు. జిహెచ్ఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ సమీపంలోని విజ్ఞానభారతీ ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్గత కళాశాల ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ పివిఎస్ శ్రీనివాస్ ముఖ్యఅతిధిగా విచ్చేసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు.

విద్యతో పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరధారుద్యం పెరగడంతో పాటు మానసిక ఉల్లాసం కల్గుతుందని ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ఆటతీరును ప్రదర్శించి ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలచిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో విబిఐటి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సిఓఈ) డాక్టర్ సతీష్, పిజికల్ డైరక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, సహాయ పిడిలు శివలాల్, మహేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

# విద్యార్థులలో సృజనాత్మకత ప్రేరణకు అవగాహన

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడం ద్వారా వారి ప్రతిభను చాటుతారని కెపిఆర్ఐటి ఐఐసి కన్వీనర్-ఇన్నోవేషన్ అంబాసిడర్ డాక్టర్ కె.వంశీకృష్ణ అన్నారు.

ఆసిఫాబాద్‌లోని శ్రీవిశ్వశాంతి ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'నవోత్తమ ఆలోచనలు, సృజనాత్మకత, వ్యాపార దృక్పథం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాల ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్ (ఐసీసీ 8.0) ఆధ్వర్యంలో విద్యార్థులకు సృజనాత్మకత, వ్యాపార దృక్పథానికి ప్రేరణ కోసం అవగాహన కల్పించారు. ఐసీసీ కన్వీనర్-సీఎస్ఈ విభాగాధిపతి వంశీకృష్ణ పాల్గొని విద్యార్థులకు సృజనాత్మకతంగా ఆలోచించడం, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సమస్యలను అవకాశాలుగా మలచుకోవడం, వ్యాపార ఆలోచనలకు అవసరమైన మౌలిక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భవిష్యత్‌లో ఇన్నోవేటర్లుగా ఎదగడానికి అవసరమైన విలువైన విషయాలను పొందారు. ఈసందర్భంగా ఐసిసి బృందం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో శ్రీవిశ్వశాంతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లంక కృష్ణప్రసాద్, మేనేజ్‌మెంట్ డైరక్టర్ ఎం.నవిత, ప్రన్సిపాల్, ఐసిసి బృందం సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసిసి కన్వీనర్ వంశీకృష్ణ

# చేపల వేటకు వెళ్లి.. మృత్యు ఒడిలోకి



చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి తనువు చాలించిన భాస్కర్ మృత దేహం

### మల్లయ్య చెరువులో.. గజ ఈతగాళ్లతో మృత దేహం వెలికితీత

### ధన్‌సింగ్ తండాలో విషాదం

**నందిగామ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి ఓ (25) సంవత్సరాల యువకుడు మృతి చెందిన సంఘటన నందిగామ మండలం రంగాపూర్ మల్లయ్య చెరువులో చోటుచేసుకుంది. సంఘటన వివరాలు వెళితే .. కుటుంబ సభ్యుల కథనం మేరకు నందిగామ మండలం సిడితాండ గ్రామపంచాయతీ పరిధిలోని



మల్లయ్య చెరువు వద్ద వీక్షిస్తున్న జనం

దన్ సింగ్ తండా కు చెందిన ముడావత్ భాస్కర్ నాయక్ (25) మోటార్ సైకిల్ పై మంగళవారం చేపలు పట్టేందుకు సమీపంలో ఉన్న మల్లయ్య చెరువుకు వెళ్లారు. సెల్ఫోన్, దుస్తులు గట్టు మీద పెట్టి చెరువులోకి దిగి వల వేశారు. షికారు క్రమంలో ప్రమాదవ షాతు వలలో చిక్కుకొని మునిగి తనువు చాలించాడు. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపి వేసి మరుసటి రోజు ఉదయం షాద్ నగర్ ఫైర్ డిపార్ట్మెంట్ ఎస్ఐ కిషన్ నేతృత్వంలో పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. వారితో పాటు నర్సప్ప గూడ గజఈత నిపుణుడు నిరటి రాజు శ్రమించారు. సహాయక చర్యల్లో సిడి త్నాడ సర్పంచ్ గబ్రు చౌహన్, రంగాపూర్ సర్పంచ్ గోవు అంజమ్మ తనయుడు గోవు రవికుమార్ , రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పలువురు రాజకీయ ప్రముఖులు ఉన్నారు. నిండు చులాలు అనిత భర్త భాస్కర్ మృత దేహాన్నిచూసి గుండెలు అవిసెలా రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. మృతుడు భాస్కర్ కు బాబు, బేబీ ఉన్నారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల పిర్యాది మేరకు నందిగామ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. ఏది ఏమైనా భాస్కర్ మృతితో దన్సింగ్ తండాలో విషాదం నెలకొంది.

## ఆపదలో అన్నీ తానై .. అంత్యక్రియలు నిర్వహించిన సర్పంచ్

### మృతుడు భాస్కర్ నాయక్ కుటుంబానికి భరోసా

**నందిగామ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** నందిగామ మండలం సిడితండ గ్రామపంచాయతీ పరిధిలోని ధన్ సింగ్ తాండకు చెందిన ముడావత్ భాస్కర్ నాయక్ అకాల మృతి పట్ల సర్పంచ్ గబ్రు చౌహాన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం భాస్కర్ చేపల వేటకు వెళ్లి మల్లయ్య చెరువులో అదృశ్యమయ్యాడనే సమాచారం తెలిసిన ఆయన హుటా హుటిన చెరువు వద్దకు వెళ్లి రంగాపూర్ సర్పంచ్ తనయుడు రవికుమార్ తో కలిసి గాలింపు సహాయక చర్యలు తీసుకున్నారు. అప్ప టికే చీకటి పడడంతో గాలింపు చర్యలు విరమిం చుకొని బుధ వారం ఉదయం అధికారులం దరికీ సమాచారం ఇచ్చి భాస్కర్ ను వెలికితీత కోసం గాలింపు సహాయక చర్యలకు శ్రీకారం చుట్టారు. ఫైర్ డిపార్ట్మెంట్, గజ ఈతగాలని రప్పించి సహాయక చర్యలను వేగవంతం చేసి మృతదేహాన్ని వెలికి తీయడంలో సఫలీకృతులయ్యారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల కోసం సహాయక చర్యలు తీసుకోవడం పట్ల సర్పంచ్ గబ్రు సేవలను గిరిజనులు అభినందించారు. అంత్యక్రియలో ఉప సర్పంచ్ రవీందర్ నాయక్, వార్డు సభ్యులు మెగావత్ నాగేష్, పత్తి, పాత్లావత్ శీను, శాంతి శ్రీను, బుజ్జి శంకర్ గ్రామస్తులు, గిరిజన నాయకులు తదితరులు ఉన్నారు.



మృతదేహం వద్ద విచారం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ గబ్రు.

## మొదటిసారి ఓటు పాయె

(మొదటి పేజీ తరువాయి)

వచ్చింది. తొలి ఓటును వినియోగించుకోవాలని ఉత్సాహంతో ఆమె పోలింగ్ కేంద్రానికి రాగా అక్కడ ఆమె ఓటు అప్పటికే ఎవరో వేసి ఉండడంతో ఆమె ఆవేదనకు గురైంది. కార్డులు పరిశీలించకుండా, ఫోటోలు చూడకుండా ఎన్నికల అధికారులు అలా ఓటు ఎలా వేయనిచ్చారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటిసారి ఓటు వేద్దామని ఎంతో ఆశతో వచ్చానని, కానీ తన ఓటు లేకపోవడం చూసి తీవ్ర మనోవేదనకు గురయ్యానని అన్నారు. తన ఓటు విషయంలో అధికారులు చేసిన నిరక్ష్యంపై ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

## వికారాబాద్‌లో పోలింగ్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డులకు పోలింగ్ నిర్వహించగా, 77,029 మంది ఓటర్లకు గాను 52,025 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 67.54 శాతం పోలింగ్ నమోదైంది. పరిగి మున్సిపాలిటీలో 18 వార్డులకు పోలింగ్ నిర్వహించగా, 27,600 మంది ఓటర్లకు గాను 21,280 మంది ఓటు హక్కు వినియోగించుకుకోగా, 77.10 శాతం పోలింగ్ నమోదైంది. కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులకు పోలింగ్ నిర్వహించగా, 11,565 మంది ఓటర్లకు గాను 8,768 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 75.81 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని అధికారులు పేర్కొన్నారు.

## ఎల్లమ్మ జాతర గోడపత్రిక విడుదల చేసిన సిఎం రేవంత్ రెడ్డి

**దుద్యాల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** మండలంలోని పోలేపల్లి గ్రామంలో వెలసిన ఎల్లమ్మదేవత బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుండి 16వరకు జరగ న్నాయి. అందుకు సంబంధించిన గోడపత్రిక ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో ఆవిష్కరించారు. ఆలయ ఈవో రాజేందర్ రెడ్డి, ఎల్లమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ ముచ్చటి వెంకటేష్, మం డల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య లతో పాటు పలువురు కార్యకర్తల సమక్షంలో గోడపత్రిక ను విడుదల చేశారు. ఈసందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మేడారం తర్వాత అంతటి పెద్ద జాతర పోలేపల్లి ఎల్లమ్మ జాతర అన్నారు. ఈ జాతరకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుండి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారని ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల వసతులు కల్పించాలని సూచించారు. త్రాగు నీటి సౌకర్యం ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి



నీటి వసతిని ఏర్పాటు చేసిన దృశ్యం

## పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు...

**దుద్యాల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలేపల్లిలో జరిగే ఎల్లమ్మ జాతర ఏర్పాట్లు ఆలయ ఈవో రాజేందర్ రెడ్డి, చైర్మన్ ముచ్చటి వెంకటేష్ ల పర్యవేక్షణలో ముమ్మరంగా సాగుతున్నాయి. హాకింపేట్ ప్రధాన కూడలి నుండి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలికంగా మట్టితో చదు ను చేస్తున్నారు. ఆలయ ఈవో రాజేందర్రెడ్డి మాట్లాడుతూ, దేవాలయం చుట్టుపక్కల నాలుగు చోట్ల తాగునీటి సదుపాయం కల్పించగా, సుమారు 20 వరకు ట్యాంకర్ల ద్వారా భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కొందరు దాతలు స్వచ్ఛందంగా బ్రహ్మోత్సవాల్లో నీటి సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. ఇటీవలే నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లతో పాటు తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హకీంపేట్ నుండి దేవాలయం వెళ్లే మార్గంలో ఒకచోట, కోస్గి, పల్లె గడ్డ నుండి దేవాలయం కు వెళ్లే మార్గంలో మరోచోట పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జాతరలో పెద్ద ఎత్తున మిఠాయి, పిల్లల ఆట వస్తువులు వంటి వివిధ దుకాణా సముదాయాలు, పిల్లలకు, పెద్దలకు ఆహ్లాదాన్ని కలిగించే రంగుల రట్నాలు వంటివి పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

## ఒక్క ఓటు కోసం గలాట

### కాంగ్రెస్ బిజెపి మధ్య స్వల్ప వాగ్వివాదం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** ఒక్క ఓటు విషయంలో రెండు పార్టీలు తరజన పర్జనలు పడుతూ ఒకరు ఓటు వేస్తారని మరొకరు ఓటు వెయ్యద్దని వాగ్వివాదం చేశారు. పట్టణంలోని తొమ్మిదవ వార్డులో కాంగ్రెస్ బిజెపి నాయకులు ఒక్క ఓటు విషయంలో గలాటపడ్డారు. బీహార్ కు చెందిన ఓ మహిళ ఓటు వేయడానికి రాగా తన ఓటు వేరే వాళ్ళు వేశారని చాలెంజ్ ఓటు వేస్తామని చెప్పి పోలింగ్ స్టేషన్ వద్దకు రావడంతో అసలు ఆమె దొంగ ఓట్లు వేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటు వేయకుండా అడ్డుకున్నారు. అప్పటికే సదరు మహిళ ఓట్లు వేసి వెళ్లిందని దాదాపు ఈ బూతులో బిజెపి నాయకులు 20 నుండి 30 ఓట్లు దొంగ ఓట్లు వేయించారని అక్కడ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థి మాధవులు అదేవిధంగా బీజేపీ అభ్యర్థి ప్యాట అశోక్ కు సంబంధించిన ఇరువర్గాల పార్టీల నాయకులు ఓటు విషయంలో గలాటా పడడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఏసిపి లక్ష్మీనారాయణ సిఐ విజయ్ కుమార్ మోహరించిన ఇరువర్గాలను చెదరగొట్టారు. సదరు మహిళలను ఏసిపి లక్ష్మీనారాయణ తీసుకెళ్లి విచారించారు.

### హైద్రాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ..

## రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి

### -ఒకరు వికారాబాద్ జిల్లా గొంగుపల్లి వాసి

### -మరొకరు నారాయణపేట జిల్లా కోస్గి మండలం తొగాపూర్ వాసిగా గుర్తింపు

**పూడూరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మంగళవారం అర్ధరాత్రి జరిగిన రెండు వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని హైద్రాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని గొంగుపల్లి గ్రామానికి చెందిన జంగంగారి అంజయ్య (32) అనేవ్యక్తి ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. అయితే మంగళవారం రాత్రి సుమారు 11-45 గంటల సమయంలో తనసొంత గ్రామంనుండి తన అత్తగారి గ్రామమైన మంచన్‌పల్లిలోఉన్న తనభార్య రజితవద్దకు వెళ్లేందుకు హోండాషైన్ టిఎస్34,హెచ్4103 నెంబరుగల సొంతబైక్‌పై హైద్రాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై బయలుదేరాడు. మార్గమధ్యలో పూడూరుగేట్ సమీపంలోకి రాగానే పరిగినుండి మన్నెగూడా వైపుకు వస్తున్న కెఎ36,సి7612 నెంబరుగల వాహనం డ్రైవరు అజాగ్రత్తవల్ల అతివేగంగా వచ్చి మోటారుసైకల్‌ను ఢీకొట్టగా బైక్‌పై వెళుతున్న జంగంగారి అంజయ్యకు తీవ్రరక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైకు నుజ్జునుజ్జు అయ్యింది. మృతుడి భార్య రజిత ఫిర్యాదుమేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదే విధంగా నారాయణపేట జిల్లా కోస్గి మండలం తొగాపూర్ గ్రామానికి చెందిన తుడుం శ్రీనివాస్(24) అనే వ్యక్తి హైద్రాబాద్‌లోని ఐడిఎ బొల్లారంలో ఆటో, ఓలా, ఊబర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి సమయంలో టిజి38,టి0905నెంబరుగల్ల సొంత ఆటోను డ్రైవింగ్‌చేసుకుంటూ హైద్రాబాద్‌నుండి తనసొంత గ్రామం తొగాపూర్‌కు హైద్రాబద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బయలుదేరాడు. అయితే మర్గమధ్యలో సుమారు 1-15 గంటల మధ్యరాత్రి సమయంలో వికారాబాద్‌జిల్లా పూడూరు మండలం కండ్లపల్లి గేట్ దగ్గరఉన్న చాయ్‌బంక్ సమీపంలోకి రాగానే మన్నెగూడనుండి హైద్రాబాద్‌వైపుకు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోను నడుపుతున్న తుడుం శ్రీనివాస్‌కు తీవ్రరక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. మృతిడి సోదరుడు రవి ఫిర్యాదుమేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు, ఇద్దరి శవాలను పోస్టుమార్ట నిమిత్తం పరిగి ప్రభుత్వాసుపత్రికి తరళించినట్లు ఎస్ఐ తెలిపారు.

### జిహెచ్ఎంసి

## విభజన ఆశాస్త్రీయం

### ..మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఉనికిని దెబ్బతీయటానికే మూడు మున్సిపల్ కార్పోరేషన్ల విభజన

### ..భౌగోళికంగా, పాలనపరంగా ప్రజలకు ఇబ్బందికరం

### ..మేడ్చల్ జిల్లా అర్బన్ బిజెపి ఇన్‌చార్జి అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసిని విభజించి మూడు కార్పోరేషన్లుగా ఏర్పాటు చేయటంలో ఎలాంటి శాస్త్రీయత లేదని, భౌగోళికంగా ,పాలనా పరంగా ప్రజలకు ఇబ్బందికరంగ ఉంటుందని మేడ్చల్ జిల్లా అర్బన్ బిజెపి ఇన్‌చార్జి అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసిని మూడు కార్పోరేషన్లుగా చేయటం పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. మూడు మున్సిపల్ కార్పోరేషన్లు చేయటం వల్ల మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఉనికిని, అస్తిత్వాన్ని కోల్పోవటం, జీవచ్ఛావాలుగ మారిపోతాయన్నారు. ఎంతో చరిత్ర ఉన్న మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలను కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్యకట్టి చీల్చటం శోచనీయమని ఆయన విమర్శించారు. హైదరాబాద్ నగరాన్ని మజ్లీస్‌కు అప్పగించటానికే ఈ మూడు కార్పోరేషన్లుగా ఏర్పాటు చేసినట్లు స్పష్టం అవుతుందని ఆయన ఆరోపించారు. మజ్లీస్‌ను సంతృప్తిలో ఉంచటానికి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవరించటం శోచనీయమని ఆయన విమర్శించారు. ఈ విభజన మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఉనికికే ప్రమాదకరంగ ఉందని, భౌగోళికంగా ప్రాంతాలను కలిపి ఆయా కార్పోరేషన్లు చేయవచ్చని అన్నారు. రంగారెడ్డి జిల్లా మూడు కార్పోరేషన్లుగా విడిపోతుందని అన్నారు. మరో వైపున గ్రామీణ ప్రాంతంగా కూడ ఉందని అన్నారు. ఈ విభజనలో ఇక మేడ్చల్ జిల్లా రెండుగా విభజింప బడిందని అన్నారు. మూసి అవతల ఉన్న ఎల్‌బినగర్ అసెంబ్లీని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్‌లో కలపటంలో అర్థం లేదన్నారు. మేడ్చల్ జిల్లా కొంత భాగం, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అసెంబ్లీలను, శేరిలింగంపల్లితో కలపటం అవివేకమని ఆయన విమర్శించారు. ఆయా జిల్లాలకు పూర్తి స్థాయి కలెక్టరేట్లు ఉండగా ఇక ఆ జిల్లాలకు మిగిలిన పని ఏమిటని మల్లారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఉనికిని దెబ్బతీసే విధంగా మూడు మున్సిపల్ కార్పోరేషన్లు ఉన్నట్లు ఆయన ఆరోపించారు.

## బాలాజీనగర్ భూములపై సిఎం, దేవాదాయశాఖ పిఎస్‌లకు వినతులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ బాలాజీనగర్ భూములలో ఇళ్లు నిర్మించి ఉంటున్నామని 2008 నుంచి రిజిస్ట్రేషన్ నిషేధించిన్నందున హక్కుదారులు ఎవరో తేల్చేందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి విచారణ జరపాలని స్థానిక కాలనీవాసులు బుధవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయ, దర్మాధాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్ సర్వేనంబర్లు 6, 7, 9, 10, 11, 12, 18, 45, 411, 465, 466, 472, 602, 603లలోని రెసిడెన్షియల్ ప్రాంత భూములలో చేసిన వెంచర్‌లో స్థలాలు కొనుగోలు చేసుకొని (రిజిస్ట్రేషన్లు) ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని 2008లో మధ్యంతరంగా దేవాదాయశాఖ నుంచి ఈభూముల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలంటూ లేఖ సంఖ్య 5163/2008 జారీ చేయడంతో స్థలాలు, ఇండ్లు రిజిస్ట్రేషన్ కావడం లేదని తెలిపారు. ఈభూములు అనుభవదారులుగా కుమ్మరి పెంటయ్య, కుమ్మరి బిక్షపతి, లింగయ్య, బాలయ్య, నర్సింహ్మ, కొమ్మిడి గోపాల్‌రెడ్డి, రాజ్‌కిషన్ సుగుదేవ్ మలాని, సోనాబాయి పేర్లు ఉన్నాయే గాని దేవాదాయ భూములని రెవెన్యూ రికార్డుల (చెస్లా, కాస్రా ఫహణీ)లో ఎక్కడ లేదని తెలిపారు. 1985-86 సంవత్సరం నుంచి అనుభవదారుల కాలమ్‌లో ఉన్న పట్టాదారుల పేర్లు తొలగించి దేవల్‌బాలాజీగా పేరు మార్పు చేసినట్లు స్పష్టంగా ఉందన్నారు. అప్పటి నుంచి 2008 వరకు భూములలో అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారని అప్పటి నుంచి నిషేధించి లావాదేవీలు జరుగకుండా ఆపివేశారని తెలిపారు. ఈసర్వేనంబర్లలో చట్టబద్దంగా స్థలాలు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మాణం చేసుకున్న వారికి నిజమైన హక్కుదారులు అవుతారని పేర్కొన్నారు. బాలాజీనగర్ భూములపై ఇండ్ల యూజమానులకు పూర్తి హక్కులు కల్పించేందుకు విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు సీఎం, దేవాదాయ పిఎస్‌లను కోరారు.

## రంగారెడ్డి జిల్లాలో 78.52 శాతం

(మొదటి పేజీ తరువాయి)

79.69 శాతం, ఇబ్రహీంపట్నంలో 77.77 శాతం, శంకర్‌పల్లిలో 76.94 శాతం, షాద్‌నగర్ మున్సిపాలిటీలో 75.70 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. అక్కడక్కడ చిన్నచిన్న సంఘటనలు తప్ప అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ శాతం పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.

# 'మున్సి' పోరు ప్రశాంతం

## ఆమనగల్లులో పోలింగ్ 84.74 శాతం

**ఆమనగల్లు, జనవరి 11, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరిగింది. ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యే సరికి 84.74 శాతం గణాంకాలు నమోదయ్యాయి. 15వార్డులలో 16984 మంది ఓటర్లకు గాను 14392 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 9 కేంద్రాలలో 30 పోలింగ్ స్టేషన్‌లలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఓటింగ్ శాతం పరుగులు పెట్టిన మధ్యాహ్నం తరువాత కొంత మందగించి నెమ్మదిగా ముగిసింది. శాంతిభద్రతల నేపథ్యంలో పోలీసులు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును నిర్వహించాయి. మహేశ్వరం డిసిపి జానకిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి పరిస్థితులను పర్యవేక్షించారు. కాగా ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తే 1వ వార్డులో 847 ఓట్లకు గాను 781 ఓట్లు నమోదయ్యాయి. అలాగే 2వ వార్డులో 917కు గాను 812, 3వ వార్డులో 1394కు గాను 1215, 4 వవార్డు 1023కు గాను 1018, 5వవార్డులో 939కు గాను 827, 6వ వార్డులో 1599కు గాను 1338, 7వవార్డులో 956కు గాను 747, 8వవార్డులో 1155కు గాను 1023, 9వవార్డులో 817కు గాను 679, 10వవార్డులో 1258కు గాను 1166, 11వవార్డు 1478కు గాను 961, 12వవార్డు 1161కు గాను 989, 13వవార్డులో 1173కు గాను 920, 14వవార్డులో 1097కు గాను 953, 15వార్డులో 1070కు గాను 933 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పోలింగ్ సమయం ముగిసిన వెంటనే బ్యాలెట్ బ్యాక్సులను భారీబందోబస్తు మధ్య పోలీసులు కౌటింగ్ కేంద్రమైన స్థానిక బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌కు తరలించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 13 బుధవారం కౌంటింగ్ చేపట్టనున్నారు.

## పరిగి మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

**- 13,17 వార్డుల్లో స్వల్ప ఉద్రిక్త**

**పరిగి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీలో 18వార్డులకు జరిగిన పోలింగ్ లో ఓటర్లు అభ్యర్థుల భవిష్యత్తును బ్యాలెట్ బాక్సుల్లో పొందుపరిచారు.. పరిగిలో 77.10శాతం పోలింగ్ నమోదైందని, మొత్తం 27600 ఓట్లకుగాను 21280 ఓట్లుపోలయ్యాయని అధికారులు తెలిపారు. రేపు విడుదలయ్యే ఫలితాలకై సర్వత్రా ఎదురు చూస్తున్నారు.. పరిగిలోని 13 వ ,17 వ వార్డుల్లో స్వల్ప ఉద్రిక్తతలు నెలకొన్నా, అన్ని వార్డుల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసాయి. 13,17 వార్డుల్లో బోగస్ ఓట్లు వేయిస్తున్నారంటూ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య వివాదం చోటు చేసుకుంది.. పోలీసులు కాంగ్రెస్ అభ్యర్థులకు సహకరిస్తున్నారంటూ పరిగి బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి 13 వ వార్డులో పోలీసులతో కొద్దిపాటి వాగ్వివాదానికి దారితీసింది.. 17వ వార్డులో బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ వాతావరణం నెలకొన్నా పోలీసులు జోక్యం చేసుకుని నాయకులకి సర్ది చెప్పి వివాదాన్ని సద్దుమణిగించారు.. పోలింగ్ లో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాలలో ఉన్న ఓటర్లు కుటుంబసమేతంగా వారి ఓటును నమోదుచేసుకున్నారు..

## కొడంగల్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్

**77.75శాతం ఓటింగ్ శాతం నమోదు**

**పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన పోలీసు అధికారులు**

కొడంగల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కొడంగల్‌లో జరిగిన పోలింగ్ ప్రశాంతగా ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటల నుండి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అల జడులు లేకుండా ప్రతి పోలింగ్ కేంద్రం దగ్గర పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలో 12 వార్డులకు గాను 25 పోలింగ్ కేంద్రాలు ఉండగా 75.75 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. 11,565 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 5610, మహిళలు 5955 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 8,760 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల వరకు 15.21 పోలింగ్ శాతం నమోదు కాగా 11 గంటలకు 36.23, 1గంటకు 58.64, మధ్యాహ్నం 3 గంటలకు 69.61, సాయంత్రం 5 గంటల వరకు 75.75 పోలింగ్ శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఇదిలాఉండగా ఈ సారి యువత, మహిళలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు.

## తాండూరులో 67.54శాతం పోలింగ్ నమోదు

**-- ఉత్సాహంగా ఓటు వేసేందకు వచ్చిన యువత**

**తాండూరు, జనవరి 11, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో 'పుర' పోరు ప్రశాంతంగా జరిగింది. తాండూరులో 67.54 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మున్సిపల్ పరిధిలో 36 వార్డులకు 9రూట్లలో 117 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం కొంతసేపు మందకొడిగా సాగిన పోలింగ్ క్రమంగా పుంజుకుంది. మధ్యాహ్నం వరకు 50 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. జిల్లా అడిషనల్ ఎస్పీ బి.ఆర్ నాయక్ తాండూరులో పర్యటించి సమీక్షించారు. మున్సిపల్ ఎన్నికలు మున్సిపాల్టీలలో ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు. పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. బుధవారం రాత్రి నుంచే వార్డులలో కట్టుదిట్టంగా వ్యవహరించారని చెప్పారు. స్రైకింగ్ ఫోర్స్, ప్రత్యేక బలగాలు బందోబస్తు చేపట్టాయని వివరించారు. మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్, డిఆర్ఓ మంగీలాల్, తాండూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్ సరళిపై ఎప్పటికప్పుడు సమీక్షించారు. మరోవైపు ప్రభుత్వ చీఫ్ విఫ్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తన ఓటు హక్కు తాండూరులో వినియోగించుకున్నారు. పట్టణంలోని 28వ వార్డుకు సంబందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో మహేందర్‌రెడ్డి తన కుమారుడు రినీష్‌రెడ్డితో కలిసి వచ్చి ఓటు వేశారు. 12 వార్డుకు సంబందించి పట్టణంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువతకూడ ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకునేందకు ముందుకు వచ్చారు. పలువురు రాజకీయ ప్రముఖులు, వ్యాపారులు తదితరులు భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్దులకు, వికలాంగులకు వారి వారి కుటుంబసభ్యులు పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఓటు వేయించారు. మరోవైపు కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పట్టణంలోని 7వ వార్డులో వార్డుకు సంబందంలేని కొత్త వ్యక్తులు ఓటు వేసేందకు రావడంతో ఓ పార్టీ నేతలు వారిని అడ్డుకున్నారు. ఎక్కడి నుంచి వచ్చారని, ఎవరికి ఓటు వేసేందకు వచ్చారని నిలదీసి పోలీసులకు అప్పగించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డిఎస్పీ నర్సింగ్ యాదయ్య, పట్టణ, రూరల్ సిఐలు సంతోష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌లు గట్టి బందోబస్తును నిర్వహించారు. పలు సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. మొత్తం మీద తాండూరులో స్వల్ప ఉద్రిక్తతలు మినహా పుర పోరు ప్రశాంతంగా ముగిసింది. మరోవైపు పట్టణంలోని 28వార్డుకు సంబందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో విద్యావేత రంగారావు ఓటర్ కార్డులో పేరు తప్పుగా ఉందంటూ నిరాకరించడంతో ఓటు వేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు.

## పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీల్లో జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని సాదారణ ఎన్నికల పరిశీలకురాలు నిర్మల కాంతి వెస్లీ, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిలు సందర్శించి పరిశీలించారు. బుధవారం మేడ్చల్ జిల్లాలోని మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని జగ్గంగూడలోని పోలింగ్ కేంద్రాలను, అదే విధంగ అలియాబాద్ మున్సిపాల్టీలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, ఆ తరువాత ఎల్లంపేట్ మున్సిపాల్టీలోని రాజబొల్లారంలోని ప్రాధమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను వారు సందర్శించి పరిశీలించారు. ఆయా మున్సిపాల్టీలోని బూతుల్లో కొనసాగుతున్న పోలింగ్ ప్రక్రియను, పోలింగ్ సరళిని నిర్వహిస్తున్న జరుగుతున్న పోలింగ్‌ను ప్రక్రియను వారు సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ విధానాన్ని పరిశీలించి ఇప్పటి వరకు ఎంత మంది ఓట్లు వేశారని ప్రిసైడింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లలో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేశారా అని, వీల్ చైర్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగ జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించటం జరిగింది. ఓటు వేయటానికి వచ్చిన వృద్దురాలితో మీ పేరు ఏమిటి, ఎంత వయసు అని కలెక్టర్ అడుగగా, తన పేరు కిష్టమ్మ అని, తన వయస్సు 65సంవత్సరాలు అని ఓటు వేయటానికి వచ్చినట్లు కలెక్టర్‌కు సంతోషంగ తెలియజేశారు.

**..సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు..కలెక్టర్**

జిల్లాలోని మూడు మున్సిపాల్టీల్లో ఎన్నికల నిర్వాహణలో ఓటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగ, శాంతియుతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసి నిర్వహించామని కలెక్టర్ మనుచౌదరి వివరించారు. మున్సిపాల్టీల్లోని సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో నిరంతర సూక్ష్మ పరిశీలించి పర్యవేక్షించటం జరిగినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి వివరించారు.

..మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీల్లోని 68వార్డుల్లో 83.99శాతం (55,426) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. మూడు మున్సిపాల్టీల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగ సజావుగా జరిగింది. వీటిలో ఓటర్లు అలియాబాద్ మున్సిపాల్టీలో 79.62శాతం, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 89.07శాతం, ఎల్లంపేట్ మున్సిపాల్టీలో 83.27శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

## ఎల్లంపేట్ మున్సిపల్‌లో ఎన్నికలు ప్రశాంతం..83.27శాతం పోలింగ్

**..సందర్శించిన సైబరాబాద్ సిపి**

**మేడ్చల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** ఎల్లంపేట్ మున్సిపాల్టీలోని 24వార్డులలో 48పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు 83.27శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగ జరిగాయి. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5వరకు పోలింగ్ కొనసాగింది. ఓటర్లు ఉదయం నుంచే ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవటం ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాలకు మహిళలు, వృద్దులు కూడ వచ్చి ఓటు వేయటం జరిగింది. పోలింగ్ కేంద్రాల్లో ప్రారంభదశలో కొద్ది చోట్ల స్వల్వ ఉద్రిక్తతలు కనిపించినప్పటికీ, పోలీసు బందోబస్తు ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. చిన్నపాటి గొడవ జరిగినప్పటి స్థానిక సిఐ సత్యనారాయణ అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గుంపులను చెదరగొట్టి పోలింగ్ ప్రక్రియకు ఇబ్బంది ఏర్పడకుండ చర్యలు తీసుకున్నారు. సైబరాబాద్ సిపి రమేశ్‌రెడ్డి ఎల్లంపేట్ మున్సిపాల్టీలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఇక తుది నిర్ణయం మాత్రం ఓటర్ల చేతిల్లోనే ఉందని తీర్పు ఇక బ్యాలెట్ బాక్సులో ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 13వ తేదీన ఎల్లంపేట్ మున్సిపాల్టీకి సంబంధించి ఓట్ల లెక్కింపు డబీల్‌పూర్‌లోన భారత్ బైబిల్ కళాశాలలో ఏర్పాటు చేయటం, బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. ఇక అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్స్‌లో భద్రపర్చి ఉన్నట్లు, ఇక ఎల్లంపేట్ మున్సిపల్ ఏ పార్టీ కైవసం చేసుకుంటుందనే విషయం ఓట్ల లెక్కింపు ఫలితాల తరువాత తేలనుందని చెప్పవచ్చు.

## షాద్‌నగర్ పట్టణంలో ఎన్నికల తీరును పరిశీలించిన కమిషనర్

**పోలింగ్ తదితర విషయాలను వివరించిన డిసిపి సిహెచ్ శిరీష రాఘవేంద్ర**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు శాంతియుతంగా ఓటును వేయాలని, పోలీసులకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి సుధీర్ బాబు స్పష్టం చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఒకటో వార్డులో మున్సిపల్ ఎన్నికల కేంద్రాన్ని కమిషనర్ సుధీర్ బాబు పరిశీలించారు. స్థానిక డిసిపి సిహెచ్ శిరీష రాఘవేంద్ర ఒకటో వార్డులో పోలింగ్ కేంద్రాన్ని కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతో.. ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశాల్లో కూడా

ఉన్నఫలంగా ఓటు హక్కు ఉండదని, కానీ భారతదేశంలో రాజ్యాంగం కల్పించిన ప్రధానమైన ఓటు హక్కు 18 ఏళ్లకే మనకు వర్తిస్తుందని ఇలాంటి శక్తివంతమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని సుదీర్ బాబు సూచించారు. ఎన్నికల్లో డబ్బు మద్యం తదితర ప్రలోభాలకు గురి చేసిన సందర్భంగా రోజువారిగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదయ్యాయనీ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయని ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, మనమందరం కలిసి పనిచేయాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక విజయోత్సవ ర్యాలీల పేరిట ప్రజలకు ఇబ్బందులు సృష్టించవద్దని కమిషనర్ వెల్లడించారు. డిసిపి కార్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన జరిగిందని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానంగా చెప్పారు. మీడియాతో కాసేపు సుధీర్ బాబు.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎస్పీగా విధులు నిర్వహించిన సమయంలో పనిచేసిన పాత్రికేయులతో కమిషనర్ జి సుధీర్ బాబు కాసేపు సరదాగా మాట్లాడారు. సీనియర్ పాత్రికేయులతో ఆయన సంతోషంగా ముచ్చటించారు. పాలమూరు ప్రజలు ఎంతో మంచి వారని ఇక్కడి ప్రాంతం ఎంత అభివృద్ధి చెందిన ఇంకా స్నేహపూర్వకంగా అందరితో కలిసి ఉండడం నచ్చిందని అన్నారు. ప్రాంతం మారిన మనుషులు మారలేదని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులతో కమిషనర్ సుధీర్ బాబు ముచ్చటించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు సుధీర్ బాబుతో ఫోటోలు దిగారు. కమిషనర్ వెంట డిసిపి సిహెచ్ శిరీష రాఘవేంద్ర పట్టణ సిఐ విజయ్ కుమార్ కొత్తూరు సిఐ నర్సయ్య ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫీచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు



ఎన్నికల పరిశీలకురాలు నిర్మల కాంతి వెస్లీ, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిలు కలిసి సందర్శించిన దృశ్యం



ఎల్లంపేట్ మున్సిపాల్టీలో పోలింగ్ కేంద్రం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు సందర్శించిన సైబరాబాద్ సిపి రమేశ్‌రెడ్డి దృశ్యం



ఎల్లంపేట్ మున్సిపాల్టీలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తున్న ఓ మహిళ దృశ్యం



ఓటు వేయటానికి వచ్చిన వృద్ధమహిళతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి, ఎన్నికల పరిశీలకురాలు నిర్మల కాంతి వెస్లీల దృశ్యం



ఆమనగల్లులో ఓటు హక్కును వినియోగించుకున్న జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



ఆమనగల్లులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తును పరిశీలిస్తున్న మహేశ్వరం డిసిపి జానకి రెడ్డి



ఆమనగల్లులో 15వ వార్డులో ఓటు హక్కు మా జన్మ హక్కు అని నినాదిస్తున్న ఓటర్లు



ఆమనగల్లు మున్సిపాలిటీలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



ఆమనగల్లు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో వీల్ చైర్‌తో వృద్దులకు సహాయం



ఆమనగల్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మహిళకు సహాయం చేస్తున్న సిబ్బంది



పరిగి లో లైన్‌లో ఉన్న ఓటర్లు



పరిగి లో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి దంపతులు



పరిగి లో ఓటు హక్కు వినియోగించుకున్న బిజెపి పరిగి అసెంబ్లీ ఇంఛార్జ్ మారుతి కిరణ్ ,కుటుంబ సభ్యులు



కొడంగల్‌లో ఓటు వేసేందుకు పోలింగ్ దగ్గర లైన్‌లో నిలబడిన ఓటర్లు

కొడంగల్‌లో 2వ వార్డులో మొట్టమొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతి





కొడంగల్‌లో ఓటు వేయించేందుకు వృద్దుడిని ఎత్తుకొని వెళ్తున్న దృశ్యం



కొడంగల్‌లో ఓటు వేసేందుకు స్ట్రెచర్‌పై వెళ్తున్న మహిళ



షాద్ నగర్ మూడో వార్డులో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు



షాద్ నగర్ లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి సుధీర్ బాబు, డిసిపి శిరీష



షాద్ నగర్ 9వ వార్డులో ఉద్రిక్తత చెలరేగగా అదుపు చేస్తున్న పోలీసులు



షాద్ నగర్ 10వ వార్డులో ఘర్షణ వాతావరణాన్ని అదుపు చేస్తున్న ఎస్ఐ



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న షాద్‌నగర్ ఆర్డీవో సరిత, ఎమ్మార్వో



వికలాంగురాలైన ఓటర్‌ను వీల్ చైర్ లో తరలిస్తున్న షాద్ నగర్ మున్సిపల్ సిబ్బందికి డిసిపి సూచనలు



14వ వార్డులో బారులు తీరిన ఫరూక్ నగర్ ఓటర్లు



తాండూరులో ఓటు హక్కును వినియోగించుకున్న చీఫ్ విఫ్ మహేందర్‌రెడ్డి.



తాండూరులో కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.



తాండూరులో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు.



తాండూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ